

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



మంగళవారం 03-11-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :136 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్

ఇండీ ర్యాలీతో రూ.11 వేల కోట్ల నష్టం!



20--25 వాణిజ్య మార్కెట్లపై ప్రభావం

2.5 లక్షల దుకాణాలు మూత

ట్రాఫిక్ ఆంక్షలతో స్తంభించిన వ్యాపారాలు

ఢిల్లీకి రాని 3--4 లక్షల మంది కస్టమర్లు

20 లక్షల మందికి ఉపాధి దెబ్బ

పండుగ వేళ వ్యాపారాలకు భారీ నష్టం

నష్టానికి బాధ్యత ఎవరిదంటూ వ్యాపారుల ప్రశ్న

2 లో

రేవంత్ సర్కార్‌కు కోమటిరెడ్డి హెచ్చరిక!

మంత్రి పదవిపై కోమటిరెడ్డి అసంతృప్తి

మనసు చంపుకుని వెళ్లినా నిధుల్లేవు

హామీ ఇచ్చి మోసం చేశారంటూ వ్యాఖ్యలు

ప్రతిపక్ష ఎమ్మెల్యేలా పోరాటం

మునుగోడు అభివృద్ధికి నిధుల కొరత

ఎమ్మెల్యే పదవికైనా రాజీనామా సిద్ధం

రేవంత్‌తో మరోసారి విభేదాల చర్చ



న్యూస్ డెస్క్, 02 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణ కాంగ్రెస్‌లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యవహారం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్న ఆయనకు ఇప్పటికీ నిరీక్షణ తప్పడం లేదు. మరోవైపు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు విడుదల కావడం లేదంటూ సొంత ప్రభుత్వంపైనే బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ పనితీరుపై పలు సందర్భాల్లో ఘాటు వ్యాఖ్యలు చేసిన రాజగోపాల్ రెడ్డి.. తాజాగా మరోసారి తనదైన శైలిలో విరుచుకుపడ్డారు.

2 లో

గ్రోక్ ఏఐ ఖర్చులు తడిసి మోపెడు!

గ్రోక్ ఏఐ నిర్వహణ ఖర్చుల భారం

ఆదాయం కంటే ఖర్చులే అధికం

భరించలేని స్థాయికి చేరిన వ్యయం

వినియోగ పరిమితులపై యూజర్ల అసంతృప్తి

సర్వర్ ఖర్చుల నియంత్రణకు పరిమితులు

చెల్లింపు ప్లాన్లలోనూ ప్రత్యేక లిమిట్లు

ధరలపై స్పష్టత ఇవ్వని మస్క్

2 లో

రాహుల్‌కు అమిత్ షా సవాల్!

హైదరాబాద్‌లో అమిత్ షా మహాపాదయాత్ర

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యం

'ఓటు బచావో' ర్యాలీపై తీవ్ర విమర్శలు

చొరబాటుదారుల ఓటు హక్కుపై హెచ్చరిక

ఈవీఎంలు, ఎస్ఐఆర్‌పై చర్చకు సవాల్

మోదీ విజయాలపై రాహుల్ గాంధీకి ప్రశ్నలు

తెలంగాణలో ఆర్ఆర్ ట్యాక్స్ వసూళ్లంటూ ఆరోపణలు

ఆరు గ్యారంటీల అమలుపై కాంగ్రెస్‌కు విమర్శలు

న్యూస్ డెస్క్, 02 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు కార్యకర్తలంతా సంకల్పం తీసుకోవాలని అమిత్ షా అన్నారు. సోమవారం నిజాం కాలేజీ ఎదుట ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ఎంజే మార్కెట్ వరకు వేలాది మంది కార్యకర్తల నడుమ బీజేపీ 'మహా పాదయాత్ర' అత్యంత కోలాహలంగా కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర హోంమంత్రి అమిత్ షా కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు కార్యకర్తలంతా పునరంకితం కావాలని అమిత్ షా పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుతూ, అరాచకత్వాన్ని అంతం చేయడమే కమల దళం లక్ష్యం కావాలన్నారు.



2 లో

ఏపీలో రీపోలింగ్ రచ్చ!

13 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్

కలెక్టర్ల నివేదికలతో ఎన్నికల సంఘం నిర్ణయం

అనంతపురం, తిరుపతి, కడపలో తిరిగి పోలింగ్

మాచర్ల, చీమకుర్తిలోనూ ఓటింగ్

జమ్మలమడుగు, పులివెందులలో రీపోలింగ్

అనంతపురంలో మళ్లీ చెలరేగిన వివాదం

రిగ్గింగ్ ఆరోపణలతో ఇరు వర్గాల వాగ్వాదం

పోలీసుల జోక్యంతో అదుపులోకి పరిస్థితి

2 లో

రాప్తాడు నిందితుడి పరిస్థితి విషమం!

పోలీసుల కాల్పుల్లో నిందితుడికి తీవ్రగాయాలు

సీఐపై కత్తితో దాడి చేసి పరారీకి యత్నం

ఆరు రౌండ్లు కాల్పులు జరిపిన పోలీసులు

అనంతపురం జీజీహెచ్‌లో చికిత్స

రెండు కాళ్లు తొలగించే అవకాశం?

తీవ్ర రక్తస్రావంతో నాలుగు యూనిట్ల రక్తం

బెంగళూరులో బాలికకు ప్రాణాపాయ చికిత్స

బాధితురాలికి ప్రభుత్వ అండ

2 లో

చంద్రబాబుకు రాజధాని రైతుల విజ్ఞప్తి!



2 లో

న్యూస్ డెస్క్, 02 నవంబర్ (ఇది కద నిజం): అమరావతి రాజధాని నిర్మాణం కోసం భూములిచ్చిన 29 గ్రామాల రైతుల సమస్యలు మరోసారి తెరపైకి వచ్చాయి. తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను కిందిస్థాయి అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రష్యాలో చిక్కుకున్న తెలుగు యువకులు!



ఫుడ్ ప్యాకింగ్ ఉద్యోగాలంటూ ఏజెంట్ మోసం

నకిలీ కాంట్రాక్టులతో యుద్ధ క్షేత్రానికి

రష్యా-ఉక్రెయిన్ సరిహద్దులో చిక్కుకున్న యువకులు

సెల్ఫీ వీడియోలో కన్నీటిపర్యంతమైన బాధితులు

'ఇదే మా చివరి రోజు కావచ్చు' అంటూ ఆవేదన

తమను కాపాడాలంటూ కేంద్రానికి వేడుకోలు

యువకులను స్వదేశానికి రప్పించాలని కుటుంబాల విజ్ఞప్తి

2 లో



11న కేటీఆర్ యాత్ర 29న గులాబీ గర్జన!

న్యూస్ డెస్క్, 02 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణలో రాజకీయ కార్యకలాపాలు ఊపందుకుంటున్న వేళ బీఆర్ఎస్ ప్రజాక్షేత్రంలోకి వెళ్లేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో నవంబర్ 11వ తేదీ నుంచి బస్సు యాత్ర చేపట్టాలని నిర్ణయించింది. గోదావరి జలాలు, సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రధాన అంశాలుగా తీసుకుని ఈ యాత్ర సాగనుంది. మరోవైపు.. తెలంగాణ ఉద్యమంలోని కీలక ఘట్టమైన దీక్షా దివస్‌ను పురస్కరించుకుని నవంబర్ 29వ తేదీన భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సభకు సుమారు 50 వేల మందిని సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ వెల్లడించారు.

కేటీఆర్ బస్సు యాత్ర నవంబర్ 11వ తేదీ నుంచి 14వ తేదీ మధ్య 2 రోజులపాటు నిర్వహించనున్నట్లు గంగుల కమలాకర్ తెలిపారు.

మిగతాది 2 లో..

- నవంబర్ 11 నుంచి కేటీఆర్ బస్సుయాత్ర
- మేడిగడ్డ నుంచి యాత్ర ప్రారంభం
- గోదావరి ప్రాజెక్టులే ప్రధాన అజెండా
- రైతుల సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన
- సాగునీరు, తాగునీటిపై ప్రత్యేక ఫోకస్
- నవంబర్ 29న దీక్షా దివస్ సభ
- 50 వేల మందితో భారీ బహిరంగ సభ
- అలుగునూర్ లేదా నుస్తులాపూర్‌లో సభ
- ఎన్నికలకు ముందే బీఆర్ఎస్ దూకుడు

వైసీపీలో వేధింపులు: విజయసాయి!

వైసీపీలో మనోవేదనకు గురయ్యా

కొత్త పార్టీ ఏర్పాటుకు విజయసాయిరెడ్డి నిర్ణయం

మూడో ప్రత్యామ్నాయమే లక్ష్యం

రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు కొత్త వేదిక

నవంబర్ 11న పార్టీ ప్రకటన

ఉదయం 11:11:11కు పూర్తి వివరాలు

ఓవి రమణకు కీలక బాధ్యతలు

వైసీపీలో మొదలైన రాజకీయ చర్చలు



న్యూస్ డెస్క్, 02 నవంబర్ (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం పాటు నెంబర్-2 నాయకుడిగా, రాజ్యసభ సభ్యుడిగా కొనసాగిన వి. విజయసాయిరెడ్డి సొంతంగా కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించి ప్రకంపనలు సృష్టించారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..వైసీపీలో ఉన్న సమయంలో తాను తీవ్ర మనోవేదనకు గురయ్యానని బహిరంగంగా ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాభివృద్ధికి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ..

2 లో

రాహుల్‌కు ప్రధాని కుర్చీనే ముఖ్యం!

రాహుల్‌పై కిషన్ రెడ్డి ఫైర్

ప్రధాని కుర్చీపైనే రాహుల్ దృష్టి

కాంగ్రెస్‌పై కుట్రల ఆరోపణలు

విదేశీ శక్తులతో చేతులు కలిపారంటూ విమర్శ

మోదీ పాలనపై ప్రశంసలు

కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీజేపీ పాదయాత్రలు

రేవంత్‌పై కిషన్ రెడ్డి విమర్శలు

జాతీయ ఇమేజ్ కోసమే ఆరాటం: కిషన్ రెడ్డి



2 లో

న్యూస్ డెస్క్, 02 నవంబర్ (ఇది కద నిజం): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని కిషన్ రెడ్డి ఆరోపించారు.విదేశీ శక్తులతో చేతులు కలిపి కేంద్ర ప్రభుత్వాన్ని కూల్చివేయాలని చూస్తున్నారని మండిపడ్డారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
మంగళవారం 03-11-2026

గ్రోక్ ఏఐ ఖర్చులు తడిసి మోపెడు!



న్యూస్ డెస్క్, 02 నవంబర్ (ఇది కద నిజం): ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ రోజు రోజుకు మరింత అడ్వాన్స్ గా మారుతోంది. అన్ని రంగాల్లో దూసుకుపోతున్న ఏఐ వినియోగంలో ఎంత సులభంగా మారుతుందో వాటి నిర్వహణ విషయంలో ఖర్చులు తలకు మించిన భారంగా మారుతోందనే వాదన వినిపిస్తోంది. ఇటువంటి తరుణంలో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ఏఐ ఖర్చులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కృత్రిమ మేధ రంగంలో దూసుకుపోతున్న గ్రోక్ ఏఐ చాట్‌బాట్ నిర్వహణ ఖర్చులు రాబడికి మించి విపరీతంగా పెరిగిపోయాయని, ఇది ఎంతమాత్రం భరించలేని స్థాయికి చేరుకుందని వ్యాఖ్యానించారు. ఎక్స్ ఏఐ సంస్థ అభివృద్ధి చేసిన ఈ గ్రాక్ బోట్ సేవలను వినియోగదారులు విపరీతంగా వాడుతుండటంతో ఆర్థిక భారంతో పాటు సాంకేతిక ఒత్తిడి పెరిగినట్లు ఆయన వెల్లడించారు.

యూజర్ ప్రశ్నకు బదులుగా..

గ్రోక్ చాట్ బాట్ వినియోగ కోటాలు వేగంగా పూర్తవుతున్నాయని కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ఈ అంశంపై ఓ మాజీ గ్రోక్ చాట్ బాట్ ప్రీమియం యూజర్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ గ్రోక్ చాట్ యూజెస్ పై లిమిస్ట్ రీసెట్ చేయాలని కోరారు. ఈ మేరకు ఎలాన్ మస్క్ కు ట్యాగ్ చేశాడు. దీనిపై స్పందిన మస్క్.. గ్రోక్ ఏఐ ఖర్చులు భరించలేకపోతున్నామని స్పష్టం చేశారు. సర్వర్ ఖర్చులు పరగకుండా నిరోధించడానికి కంపెన కఠిన వినియోగ పరిమితులను అమలు చేస్తోందని వెల్లడించారు.వచ్చే ఆదాయంతో పోలిస్తే.. ఖర్చులే ఎక్కువ అవుతోందని స్పష్టం చేశారు. గ్రోక్ బాట్ సేవలను సూపర్‌గ్రోక్, కర్సర్ వంటి పలు చెల్లింపు సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ల ద్వారా అందిస్తున్నారు. ఈ ప్లాన్లలో ఇతర సేవలకు కేటాయించిన వినియోగ పరిమితులకు భిన్నంగా గ్రోక్ బాట్‌కు ప్రత్యేక పరిమితులు ఉంటాయి. అయితే ధరలు, వినియోగ పరిమితులకు సంబంధించిన పూర్తి వివరాలను మస్క్ తాజా ప్రకటనలో వెల్లడించలేదు.

రేవంత్ సర్కార్‌కు..కోమటిరెడ్డి హెచ్చరిక!

మొదటి పేజీ తరువాయి

మంత్రి పదవి ఇస్తామని చెప్పి మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేయడంతో పాటు, నిధుల కోసం ప్రతిపక్ష ఎమ్మెల్యేలాగా ప్రభుత్వంతో పోరాడాల్సి వస్తోందని వ్యాఖ్యానించారు. అవసరమైతే ఎమ్మెల్యే పదవిని సైతం త్యాగం చేయడానికి సిద్ధమంటూ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో కొత్త రాజకీయ చర్చకు తెరలేపాయి.

మనసు చంపుకుని వెళ్లినా..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మంత్రి పదవిపై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆశలు పెట్టుకున్నారనే చర్చ రాజకీయ వర్గాల్లో ఉంది. అయితే ఇప్పటివరకు ఆయనకు కేబినెట్‌లో చోటు దక్కలేదు. ఈ క్రమంలో పలుమార్లు తన అసంతృప్తిని బహిరంగంగానే వ్యక్తం చేశారు. తాజాగా గట్టుప్పల్ మండలంలో పర్యటించిన సందర్భంగా మంత్రి పదవిపై మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రి పదవి ఇస్తామని చెప్పి మోసం చేశారని, అయినప్పటికీ మనసు చంపుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దగ్గరకు వెళ్లినా నిధులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే తనకు మంత్రి పదవి ఇస్తే ఎక్కడికో వెళ్లిపోతాననే ఉద్దేశంతో ఇవ్వడం లేదంటూ రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ఆసక్తిని రేపుతున్నాయి.

కష్టపడి సహాయం చేస్తే మోసం చేశారు

మంత్రి పదవి సంగతి పక్కనపెడితే కనీసం నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులైనా విడుదల చేయాలని రాజగోపాల్ రెడ్డి పట్టుబడుతున్నారు. అధికార పార్టీలో ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ నిధుల కోసం ప్రతిపక్ష ఎమ్మెల్యేలాగా ప్రభుత్వంతో కొట్లాడాల్సి వస్తోందని అన్నారు. రోడ్ల నిర్మాణానికి టెండర్లు పిలుస్తున్నప్పటికీ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు మధ్యలోనే ఆగిపోతున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుత పనులకే నిధులు విడుదల కాకపోతే కొత్త పనులు ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. జీతాలు, రైతు బంధు వంటి పథకాలకు నిధులు కేటాయించడంలోనూ ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని వ్యాఖ్యానించారు. అభివృద్ధి పనులకు ప్రభుత్వం నుంచి సరైన సహకారం అందకపోవడం వల్లే మునుగోడు నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మునుగోడు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి జరగకపోతే పదవులను పట్టుకుని వేలాడబోనని, అవసరమైతే ఎమ్మెల్యే పదవిని సైతం త్యాగం చేయడానికి సిద్ధమని సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో ఎంతో కష్టపడి పలువురిని ఎమ్మెల్యేలుగా గెలిపిస్తే వారంతా తనను మోసం చేశారని వ్యాఖ్యానించారు. తాను ఎవరికీ భయపడనని, రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు:

సద్దుమణిగిందనుకునేలోపు..

తాజా వ్యాఖ్యలతో మరోసారి కాంగ్రెస్‌లో అంతర్గత రాజకీయాలు చర్చకు వచ్చాయి. ఒకవైపు మంత్రి పదవి దక్కలేదనే అసంతృప్తి, మరోవైపు నియోజకవర్గానికి నిధులు విడుదల కావడం లేదనే ఆవేదనను రాజగోపాల్ రెడ్డి బహిరంగంగానే వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ సొంత ప్రభుత్వంపై విమర్శలు చేసిన ఆయన ఇప్పుడు ఏకంగా ఎమ్మెల్యే పదవిని త్యాగం చేయడానికైనా సిద్ధమంటూ ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఆయన తాజా వ్యాఖ్యలు నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకున్నవేనా? లేక నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే ప్రయత్నమా? అన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గతంలో సీఎం రేవంత్ రెడ్డితో విభేదాలు తారస్థాయికి చేరాయనే ప్రచారం జరిగిన సమయంలోనే ఆయన ముఖ్యమంత్రి పాల్గొన్న సభకు హాజరుకావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. దీంతో ఇద్దరి మధ్య పరిస్థితులు సద్దుమణిగాయని కాంగ్రెస్ శ్రేణులు భావించాయి.

రేవంత్‌తో మరోసారి ఢీ అంటే ఢీనా?

ఇంతలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి మధ్య విభేదాల చర్చకు రేడియల్ రోడ్ల టెండర్ల వ్యవహారం మరోసారి చిచ్చు పెట్టిందనే చర్చ జరుగుతోంది. రేడియల్ రోడ్ల టెండర్ల విషయంలో తన కుటుంబానికి చెందిన కంపెనీని ప్రభుత్వం పక్కన పెట్టిందని ఆరోపిస్తూ రాజగోపాల్ రెడ్డి న్యాయపోరాటానికి దిగిన విషయం తెలిసిందే. ఈ పరిణామం ముఖ్యమంత్రి, మునుగోడు ఎమ్మెల్యే మధ్య రాజకీయ దూరం పెరుగుతోందని ఈ క్రమంలోనే ఇక నేరుగా రేవంత్ రెడ్డితో ఢీ అంటే ఢీ అనేందుకు సిద్ధం అవుతున్నారా అందులో భాగంగానే తాజా వ్యాఖ్యలు చేశారా అనే చర్చ జరుగుతోంది. ఓ వైపు నిధుల విషయంలో ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తున్న వేళ ప్రభుత్వాన్ని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి టార్గెట్ చేయడం టీ కాంగ్రెస్ లో మరోసారి చర్చనీయాశంగా మారింది. నిధుల విషయంలో ఇటీవల జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సీరియస్ గా రియాక్ట్ అయ్యారు. క్రమశిక్షణ కమిటీ అంశాన్ని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో కోమటిరెడ్డి వ్యాఖ్యల విషయంలో పీసీసీ ఎలా స్పందిస్తుందో చూడాలి.

రాహుల్‌కు ప్రధాని కుర్చీనే ముఖ్యం!

మొదటి పేజీ తరువాయి



దేశంలో అశాంతిని సృష్టించడమే ధ్యేయంగా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని, రాహుల్ గాంధీకి కేవలం ప్రధాని కుర్చీపైనే దృష్టి తప్ప దేశ సంక్షేమం పట్టదని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో దేశంలో స్థిరమైన, పటిష్టమైన పాలన సాగుతోందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ పన్నుతున్న కుట్రలు, రాహుల్ గాంధీ వైఖరిని ప్రజల ముందు ఎండగడతామని తెలిపారు. ఇందులో భాగంగానే ఇకపై అన్ని రాష్ట్రాల్లో విస్తృతంగా పాదయాత్రలు చేపట్టి ప్రజలకు నిజాలను వివరిస్తామని వెల్లడించారు.

మరోవైపు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డి జాతీయ నేతగా ఎదగాలని తీవ్రంగా ఆరాటపడుతున్నారని ఎద్దేవా చేశారు. పబ్లిసిటీ కోసం, జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించడం కోసమే ఆయన ఇష్టానుసారంగా మాట్లాడటం అలవాటుగా మార్చుకున్నారని వ్యాఖ్యానించారు.

వైసీపీలో వేధింపులు: విజయసాయి!

మొదటి పేజీ తరువాయి

బలమైన 'మూడో ప్రత్యామ్నాయం' అత్యవసరమని అభిప్రాయపడిన ఆయన, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా సరికొత్త రాజకీయ వేదికను స్థాపిస్తున్నట్లు స్పష్టం చేశారు.

ఈ క్రమంలో తన కొత్త పార్టీకి సంబంధించిన పూర్తి వివరాలు, జెండా, విధివిధానాలను 2026 నవంబర్ 11వ తేదీన (11-11-2026) ఉదయం సరిగ్గా 11 గంటల 11 నిమిషాల 11 సెకన్లకు అధికారికంగా ప్రకటించనున్నట్లు విజయసాయిరెడ్డి వెల్లడించారు. అంతేకాకుండా, పార్టీ కార్యకలాపాలను జాతీయ స్థాయిలో విస్తరించే క్రమంలో ఓవి రమణకు పార్టీ నేషనల్ జనరల్ సెక్రెటరీ (జాతీయ ప్రధాన కార్యదర్శి) బాధ్యతలు అప్పగిస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. విజయసాయిరెడ్డి తీసుకున్న ఈ సంచలన నిర్ణయం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో, ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ఏపీలో రీపోలింగ్ రచ్చ!



న్యూస్ డెస్క్, 02 నవంబర్ (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల రీపోలింగ్‌లోనూ రచ్చ చోటుచేసుకుంది. రీపోలింగ్ జరుగుతున్న పలు చోట్ల నాయకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. నిన్న జరిగిన ఎన్నికల్లో రిగ్గింగ్, బూత్ కబ్జా ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం 13 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్‌కు ఆదేశించించింది. ఎన్నికల్లో అక్రమాలు జరిగినట్లు జిల్లా కలెక్టర్లు ఇచ్చిన నివేదికల ఆధారంగా రీ పోలింగ్ ప్రక్రియ చేపట్టారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 13 కేంద్రాల్లో రీ పోలింగ్ కొనసాగనుంది.

రీపోలింగ్.. ఎక్కడ అంటే?

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 13 చోట్ల రీ పోలింగ్ జరుగుతోంది. అనంతపురం కార్పొరేషన్‌లోని 30వ డివిజన్‌లో 3వ నంబర్ పోలింగ్ కేంద్రం, తిరుపతి 36వ డివిజన్‌లో 4వ నంబర్ పోలింగ్ కేంద్రం, కడప నగరపాలక సంస్థ 15వ డివిజన్‌లోని 2వ పోలింగ్ కేంద్రంలో రీపోలింగ్ నిర్వహిస్తున్నారు. అలాగే మాచర్ల మున్సిపాలిటీలోని 23వ వార్డులో 1, 2వ పోలింగ్ కేంద్రాలు, ప్రకాశం జిల్లా చీమకుర్తి పురపాలక సంఘం 14వ వార్డులోని 1వ పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ కొనసాగుతోంది. జమ్మలమడుగు మున్సిపాలిటీలోని 3వ వార్డులో 2వ పోలింగ్ కేంద్రంతో పాటు 17, 29వ వార్డుల్లోని 1వ నంబర్ పోలింగ్ కేంద్రాల్లోనూ రీపోలింగ్ చేపట్టారు. పులివెందుల మున్సిపాలిటీలోని 1, 3, 7, 8వ వార్డుల్లోని 1వ నంబర్ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు.

అనంతపురంలో మళ్లీ ఉద్రిక్తత..

అనంతపురంలోని 30వ డివిజన్‌లోని 3 నంబర్ పోలింగ్ కేంద్రంలో కూటమి నేతలు రిగ్గింగ్‌కు పాల్పడ్డారనే ఆరోపణలు రావడంతో ఇక్కడ తిరిగి పోలింగ్ నిర్వహిస్తున్నారు. అయితే సోమవారం ఉదయం రీపోలింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే మరోసారి వివాదం చెలరేగింది. పోలింగ్ కేంద్రంలో రిగ్గింగ్‌కు పాల్పడుతున్నారని, బయటి వ్యక్తులు వచ్చారంటూ ఇరు వర్గాలు ఆరోపణలు చేసుకోవడంతో వాగ్వాదం మొదలైంది. అది కాస్తా తోపులాటకు దారితీసింది. దీంతో పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

ఇండీ ర్యాలీతో రూ.11 వేల కోట్ల నష్టం!



న్యూస్ డెస్క్, 02 నవంబర్ (ఇది కద నిజం): దేశ రాజధాని ఢిల్లీలోని చారిత్రాత్మక రాంలీలా మైదాన్‌లో ప్రతిపక్ష 'ఇండీ' కూటమి నిర్వహించిన భారీ నిరసన ర్యాలీ తమ పాలిట శాపంగా మారిందని, దీనివల్ల దాదాపు ?11,000 కోట్ల మేర వ్యాపార నష్టం వాటిల్లిందని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు సీటీఐ చైర్మన్ బ్రిజేశ్ గోయల్ వివరాలను వెల్లడిస్తూ.. ర్యాలీ పరిసర ప్రాంతాలైన చాందినీ చౌక్, కరోల్ బాగ్, సదర్ బజార్ సహా 20 నుంచి 25 ప్రధాన వాణిజ్య మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడిందని తెలిపారు. ఈ మార్కెట్ల పరిధిలోని దాదాపు 3 లక్షల దుకాణాల్లో ఏకంగా 2.5 లక్షల దుకాణాలు నిరసనల భయంతో, భద్రతా కారణాల దృష్ట్యా పూర్తిగా మూతపడ్డాయని ఆయన పేర్కొన్నారు. వేలాది వాహనాల రాక, భారీ ట్రాఫిక్ ఆంక్షల కారణంగా నగరంలోకి ప్రవేశించే మార్గాలు స్తంభించిపోవడంతో సాధారణ జన జీవనం, వాణిజ్య కార్యకలాపాలు పూర్తిగా స్తంభించిపోయాయని ఆయన ఆరోపించారు.

ముఖ్యంగా ధన్‌తేరస్, దీపావళి పండుగల సీజన్ కావడంతో ఏటా ఈ సమయంలో రాజధాని పరిసర ప్రాంతాలైన ఎన్‌సీఆర్, పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున కొనుగోలుదారులు తరలివస్తుంటారని, అయితే ఈ ర్యాలీ ఆందోళనలతో దాదాపు 3 నుంచి 4 లక్షల మంది కస్టమర్లు ఢిల్లీకి రాకుండా వెనక్కి తగ్గిపోయారని బ్రిజేశ్ గోయల్ వాపోయారు. దీనివల్ల హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులతో పాటు సుమారు 20 లక్షల మంది దినసరి కూలీలు, చిరువ్యాపారులు, ఈ-రిక్షా డ్రైవర్లు తమ రోజువారీ జీవనోపాధిని కోల్పోయారని తెలిపారు. పండుగ వ్యాపారాలు జోరుగా సాగాల్సిన కీలక సమయంలో రాజకీయ సభల పేరుతో మార్కెట్లను స్తంభింపజేయడం దారుణమని, వ్యాపారులకు జరిగిన ఈ భారీ నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన నిలదీశారు.

రష్యాలో చిక్కుకున్న తెలుగు యువకులు!



న్యూస్ డెస్క్, 02 నవంబర్ (ఇది కద నిజం): ఉపాధి కోసం రష్యా వెళ్లిన విశాఖపట్నానికి చెందిన ఇద్దరు యువకులతో సహా ఐదుగురు తెలుగు యువకులు అక్కడి యుద్ధ క్షేత్రంలో తీవ్ర ప్రాణభయంతో అల్లాడుతున్నారు. రష్యా సైన్యంలో 'ఫుడ్ ప్యాకింగ్' ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నేపాల్‌కూ చెందిన ఒక ఏజెంట్ వీరిని నమ్మించి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. తీరా అక్కడికి వెళ్లాక, నకిలీ కాంట్రాక్టులతో వారిని మోసం చేసి రష్యా-ఉక్రెయిన్ సరిహద్దులోని భయంకరమైన యుద్ధ రంగానికి బలవంతంగా పంపించారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'ఇదే మా చివరి రోజు కావచ్చు'.. సెల్ఫీ వీడియోలో కన్నీటి పర్యంతం

సరిహద్దుల్లో సైన్యం పహారా నడుమ చిక్కుకుపోయిన ఈ యువకులు తాజాగా ఒక సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. "ఇక్కడ ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. బహుశా ఇదే మాకు చివరి రోజు కావచ్చు. కనీసం మేము బతికి బయటపడతామో లేదో కూడా చెప్పలేం" అని కన్నీళ్లు పెట్టుకుంటూ వారు తమ దీనస్థితిని వివరించారు. బాంబుల మోతలు, తుపాకుల శబ్దాల మధ్య ప్రతి క్షణం ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

కాపాడాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వేడుకోలు

తాము మోసపోయామని గ్రహించేలోపే సరిహద్దుల్లోకి నెట్టేశారని, భారత ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ ప్రాణాలను కాపాడాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు. విదేశాంగ శాఖ ఉన్నతాధికారులు, కేంద్ర ప్రభుత్వం దౌత్యపరమైన చర్యలు చేపట్టి, తమను సురక్షితంగా స్వదేశానికి, కన్నవారి వద్దకు చేర్చేలా సహాయం చేయాలని కన్నీళ్లతో వేడుకుంటున్నారు. విశాఖకు చెందిన ఈ యువకుల కుటుంబ సభ్యులు కూడా తీవ్ర ఆందోళన చెందుతూ, తమ పిల్లలను క్షేమంగా రప్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

రాప్తాడు నిందితుడి పరిస్థితి విషమం!



న్యూస్ డెస్క్, 02 నవంబర్ (ఇది కద నిజం): రాప్తాడు నిందితుడిపై ఆదివారం పోలీసులు కాల్పులు జరిపారు. నిందితుడు ఆత్మకూరు అడవుల్లో ఉన్నాడని సమాచారం అందడంతో పోలీసులు అక్కడకు వెళ్లి అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో నిందితుడు సీఐపై కత్తితో దాడి చేసి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో పోలీసులు నిందితుడిపై ఆరు రౌండ్ల కాల్పులు జరపగా తీవ్రగాయాలు అయ్యాయి. తరవాత పోలీసులు అతడిని అనంతపురం జీజీహెచ్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తీవ్రగాయాలు కావడంతో నిందితుడి కాళ్లు తొలగించే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

కాళ్లలో మూడు బుల్లెట్లు ఉన్నాయని, ముఖానికి కూడా గాయాలైనట్టు తెలిపారు. తీవ్రరక్త స్రావం జరగడంతో 4 యూనిట్ల రక్తం ఎక్కించినట్టు చెప్పారు. ప్రస్తుతం ఆక్సీజన్ అందిస్తున్నామని, స్కానింగ్ తరవాత తదుపరి చికిత్స అందిస్తామని తెలిపారు. ఇదిలా ఉంటే నిందితుడు రాప్తాడు ప్రభుత్వ పాఠశాలలో ఓ బాలికపై ఎలక్ట్రిక్ రంపంతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. బాలికకు వరసకు బాబాయ్ అయ్యే నిందితుడు తనను పెళ్లి చేసుకోవాలని వేదిస్తూ ఈ దాడి చేశాడు. ప్రస్తుతం బాలిక బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య పోరాడుతోంది. బాధితురాలికి ప్రభుత్వమే వైద్యం అందిస్తూ అన్ని విధాలా వారిని ఆదుకుంటామని ప్రకటించింది.

చంద్రబాబుకు రాజధాని రైతుల విజ్ఞప్తి!

మొదటి పేజీ తరువాయి

ముఖ్యంగా నివాస స్థలాలను సైతం వ్యవసాయ భూములుగా చూపిస్తున్నారని.. దీనివల్ల గ్రామ కంఠాల పరిధిలోని తమ ఇళ్లకు ముప్పు పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారు. కట్ ఆఫ్ డేట్ ప్రకటించామంటూ అధికారులు నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు.

పోలవరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చూపిస్తున్న శ్రద్ధలో కొంతైనా రాజధాని రైతుల సమస్యలపై చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. తాము ఏ ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని.. సాధారణ రైతులమని, కూటమి ప్రభుత్వం ఏర్పాటుకు తాము కూడా కృషి చేశామని గుర్తుచేస్తున్నారు. సమస్యల పరిష్కారం కోసం సీఆర్డీఏ కార్యాలయానికి వచ్చినా కమిషనర్ తమను కలవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి నేరుగా స్పందించి 29 గ్రామాల రైతుల సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. అమరావతి సీఆర్డీఏ కార్యాలయంలో 29 గ్రామాల రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు.

రాహుల్‌కు అమిత్ షా సవాల్!

మొదటి పేజీ తరువాయి

నాడు సర్దార్ వల్లభాయ్ పటేల్ ధైర్యంతో నిజాం మెడలు వంచి హైదరాబాద్‌ను విముక్తి చేశారని అమిత్ షా గుర్తుచేశారు.

అది చొరబాటుదారుల ఓటు బ్యాంక్ ర్యాలీ..

కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న 'ఓటు బచావో' ర్యాలీలపై అమిత్ షా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అది ఓట్లను కాపాడే ర్యాలీ కాదని, చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా మార్చుకునే యత్నమని విమర్శించారు. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి ఎన్ని ప్రయత్నాలు చేసినా చొరబాటుదారులకు ఓటు హక్కు దక్కనివ్వబోమని స్పష్టం చేశారు. దేశంలో మరణించిన వారి ఓట్లు, దాదాపు కోటికి పైగా ఉన్న నకిలీ ఓట్లు, దేశంలో లేని 3 కోట్ల మంది ఓట్లను తొలగించాలా వద్దా అని అమిత్ షా ప్రశ్నించారు.

2014, 20419లో మోడీ విజయం సాధించలేదా?

ఈవీఎంలు, ఎస్ఐఆర్ ల వల్లే బీజేపీ గెలుస్తోందన్న కాంగ్రెస్ ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. 2014, 2019లలో ఎస్ఐఆర్ లేకపోయినా నరేంద్ర మోడీ ఘనవిజయం సాధించలేదా అని ప్రశ్నించారు. 'ఈవీఎంల వల్లే మేం గెలిస్తే, మరి తెలంగాణలో కాంగ్రెస్ ఎలా గెలిచింది? కేరళ, తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్‌లలో ప్రతిపక్షాలు ఎలా అధికారంలోకి వచ్చాయి?' అని రాహుల్ గాంధీని, 'ఇండీ' కూటమి నేతలను నిలదీశారు. ఈవీఎంలు, ఎస్ఐఆర్‌లపై ఎక్కడైనా చర్చకు సిద్ధమని హైదరాబాద్ వేదికగా సవాల్ విసిరారు.

తెలంగాణలో ఆర్ఆర్ ట్యాక్స్ వసూళ్లు..

గత పదేళ్ల పాలనలో రూ. 12 లక్షల కోట్ల అవినీతికి పాల్పడిన కాంగ్రెస్ పార్టీని దేశ ప్రజలు ఛీకొడుతున్నారని అమిత్ షా వ్యాఖ్యానించారు. అనేక రాష్ట్రాల్లో ఆ పార్టీ ఉనికి కోల్పోతోందని, ప్రస్తుతం కాంగ్రెస్ వెంటిలేటర్‌పై ఉందన్నారు. "వెంటిలేటర్‌పై ఉన్న కాంగ్రెస్ పార్టీ.. ప్రధాని నరేంద్ర మోదీతో పరుగుపందెంలో పోటీ పడగలదా?" అని ఎద్దేవా చేశారు. తెలంగాణను కాంగ్రెస్ అధిష్టానం ఏటీఎంలా మార్చుకుందని.. ఆర్ఆర్ ట్యాక్స్ జోరుగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు కావడం లేదని అన్నారు. తెలంగాణలో అవినీతి పాలన కొనసాగుతోందని.. కాంగ్రెస్ అధికారంలో ఉన్న ప్రతి చోటా అవినీతే రాజ్యమేలుతోందని ఆరోపించారు.

11న కేటీఆర్ యాత్ర.. 29న గులాబీ గర్జన!

మొదటి పేజీ తరువాయి



కరీంనగర్‌లోని శ్వేతా హోటల్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పార్టీ ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ భేటీలో బస్సు యాత్ర మార్గం, దీక్షా దివస్ సభ నిర్వహణ, రైతుల సమస్యలపై చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి చర్చించారు. మేడిగడ్డ నుంచి ప్రారంభమయ్యే కేటీఆర్ బస్సు యాత్ర గోదావరి పరీవాహక ప్రాంతంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల మీదుగా కొనసాగనుంది.

ఆయా ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు వాటి ద్వారా సాగునీరు అందే ప్రాంతాలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ పార్టీ భావిస్తోంది. సాగునీటితో పాటు తాగునీరు, విద్యుత్ సరఫరా, గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను కూడా యాత్రలో ప్రస్తావించనున్నారు. సాగునీటి అంశాన్ని రాజకీయ చర్చలోకి తీసుకురావడం ద్వారా రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని గులాబీ పార్టీ నాయకులు భావిస్తున్నారు. ముఖ్యంగా వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో నీటి వనరులు, ప్రాజెక్టుల నిర్వహణపై ప్రజలకు వివరించేందుకు ఈ యాత్రను వేదికగా చేసుకోనున్నారు.

తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ చేపట్టిన నిరాహార దీక్షకు సంబంధించిన జ్ఞాపకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నవంబర్ 29వ తేదీన దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. 2009 నవంబర్ 29వ తేదీన అప్పటి ఉద్యమ నాయకుడు కేసీఆర్‌ను అలుగునూర్ వద్ద పోలీసులు అరెస్టు చేసిన ఘటనను ఈ సందర్భంగా గుర్తుచేయనున్నారు. ఈ చారిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతంలోనే సభ నిర్వహించాలని పార్టీ యోచిస్తోంది. మానకొండూరు నియోజకవర్గ పరిధిలోని అలుగునూర్ లేదా నుస్తులాపూర్ ప్రాంతంలో సభ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు గంగుల కమలాకర్ తెలిపారు.

ఈ దీక్షా దివస్ కార్యక్రమానికి సుమారు 50 వేల మందిని సమీకరించాలని బీఆర్ఎస్ పార్టీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు గంగుల చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో దీక్షా దివస్‌కు ఉన్న ప్రాధాన్యతను ప్రజలకు వివరించడంతో పాటు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడంపై దృష్టి పెట్టనున్నారు. బస్సు యాత్ర, దీక్షా దివస్ సభ ఏర్పాట్ల, యాత్రలో ప్రజల నుంచి వచ్చే సమస్యలను తెలుసుకోవడం, ప్రాజెక్టుల పరిస్థ

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
మంగళవారం 03-11-2026

ఉస్మానియా యూనివర్సిటీలో బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు అవగాహన కార్యక్రమం



ఇది కద నిజం, హైదరాబాద్ :ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రరీ ప్రాంగణంలో బిఆర్ఎస్వి నాయకత్వంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై విద్యార్థులకు, యువతకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాల్సిన బాధ్యతను ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, డిగ్రీ లేదా తత్సమాన విద్యను పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులందరూ తప్పనిసరిగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడానికి మరియు తమ ప్రాంత సమస్యలపై ప్రశ్నించే హక్కును పొందడానికి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం చాలా కీలకమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి నాయకులు జంగయ్య, దశరథ్, ప్రశాంత్, నర్సింగ్, రాకేష్, ప్రవీణ్, శరత్ తదితరులు పాల్గొని విద్యార్థులకు ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు.

మణికొండలో ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమం

అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి : నీరుడు సర్వేష్ ముదిరాజ్



ఇది కద నిజం, మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మణికొండ మున్సిపాలిటీలో ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. తెలంగాణ రక్షణ సేన పార్టీకి చెందిన రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నీరుడు సర్వేష్ ముదిరాజ్ బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ కార్యక్రమంలో భాగంగా అర్హులైన పట్టభద్రులకు ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ, ప్రతి ఒక్కరూ తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని ప్రోత్సహిస్తున్నారు.

ఈ సందర్భంగా నీరుడు సర్వేష్ ముదిరాజ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని పేర్కొన్నారు. ముఖ్యంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవడం ప్రజాస్వామ్య బలోపేతానికి దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ నాయక్ టిల్లు ముదిరాజ్ వరుణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు గడువు పొడగించాలి

- నామినేషన్లు వేసే వరకు ఓటరు నమోదుకు అవకాశం కల్పించాలి
- తెలంగాణ సీఈఓను కోరిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు కల్వకుంట్ల కవిత
- తమ పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా సహకరించాలని విజ్ఞప్తి

ఇది కద నిజం,హైదరాబాద్ : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు గడువు పొడగించాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్ బీఆర్ కేఆర్ భవన్ లో తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈవో) సి. సుదర్శన్ రెడ్డితో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు గడువు పొడగించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు గడువు ఈనెల 6వ తేదీతో ముగుస్తుందని.. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చి నామినేషన్ల ప్రక్రియ కొనసాగే వరకు ఓటరు నమోదుకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

సీఈవో సమావేశం అనంతరం కవిత మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ ఈ నెల 21 వరకు కొనసాగుతుందని, గ్రాడ్యుయేట్ ఓటరు నమోదుకు ఈనెల 6వ తేదీతో గడువు ముగిసి పోతుందని పేర్కొనడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసే వరకు గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు గడువు పొడగించాలని తమ సూచనకు సీఈవో అంగీకరించారని తెలిపారు. తమ లాంటి కొత్త పార్టీలకు తమ ఎజెండాను చెప్పుకోవడానికి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు మంచి అవకాశమన్నారు. రాష్ట్రంలోని మూడింట రెండో వంతు ప్రాంతంలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం నెలకొన్నదని చెప్పారు. జెన్ జీలు, గ్రాడ్యుయేట్లు ఈ ఎన్నికలను సీరియస్ గా తీసుకొని ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని కోరారు. ఎన్నికలు జరిగిన ప్రతిసారి గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు ప్రక్రియ చేపడుతుండటం.. పోటీ చేసే అభ్యర్థులకు తలకు మించిన భారంగా మారుతుందని.. ఈ ప్రక్రియ మార్పు తీసుకురావాలని ఎన్నికల కమిషన్ ను కోరుతామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పెద్ద విద్యాసంస్థల యజమానులు పోటీకి దిగుతుండటం.. వారి విద్యాసంస్థల్లోనే పెద్ద ఎత్తున ఓటరు నమోదు చేస్తుండటంతో ఎన్నికలు ఏకపక్షంగా జరుగుతున్నాయని.. వీటిపైనా ఎన్నికల కమిషన్ దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.



పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సహకరించండి

తమ పార్టీ "తెలంగాణ రక్షణ సేన" రిజిస్ట్రేషన్ ప్రక్రియ కేంద్ర ఎన్నికల సంఘం వద్ద పెండింగ్ లో ఉందని, ఈ విషయంలో తమకు సహకరించాలని సీఈవోను కోరామని కవిత చెప్పారు. రాష్ట్రంలోని ప్రధాన ప్రతిపక్షాలకు ధీటుగా తమ ప్రజా సమస్యలపై పోరాడుతున్న తీరును నివేదిక రూపంలో కేంద్ర ఎన్నికల సంఘానికి అందించాలని సీఈవోను కోరామన్నారు. కొత్తగా పార్టీ ఏర్పాటు చేసినప్పటికీ అన్ని విభాగాల కమిటీలు ఏర్పాటు చేశామని, రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున పార్టీ కార్యాకలాపాలు నిర్వహిస్తున్న విషయాన్ని సీఈవో దృష్టికి తీసుకెళ్లామని అన్నారు.

TWJF నవాబుపేట మండల నూతన కమిటీ ఏర్పాటు

అధ్యక్షుడిగా షాబుద్దీన్.. ఉపాధ్యక్షుడిగా కృష్ణ ఎంపిక జిల్లా అధ్యక్షుడు రామచందర్ ఆధ్వర్యంలో కమిటీ ప్రకటన

ఇది కద నిజం, వికారాబాద్ జిల్లా, నవాబుపేట : తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (TWJF) ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా నవాబుపేట మండల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. TWJF జిల్లా అధ్యక్షుడు రామచందర్ ఆధ్వర్యంలో సోమవారం నవాబుపేట్ మండల పరిధిలోని శ్రీ సాయి గార్డెన్ లో నూతన కమిటీని ప్రకటించి వివిధ పదవులకు సభ్యులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడిగా షాబుద్దీన్, ఉపాధ్యక్షుడిగా కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా విష్ణువర్ధన్, కార్యదర్శులుగా ప్రశాంత్, హరీష్, కోశాధికారిగా రాములు, సలహాదారుడిగా సుదర్శన్‌ను ఎంపిక చేశారు. జర్నలిస్టుల ఐక్యతను బలోపేతం చేయడం, వారి హక్కులను పరిరక్షించడం, వృత్తిపరంగా ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయడం, జర్నలిస్టులకు సంఘం తరఫున అండగా నిలవడం ప్రధాన లక్ష్యాలుగా ఈ మండల కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రామచందర్ మాట్లాడుతూ జర్నలిస్టులందరూ ఐక్యంగా ఉంటూ వృత్తి గౌరవాన్ని కాపాడుకోవాలని, సమస్యల పరిష్కారానికి సంఘం వేదికగా సమష్టిగా కృషి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. నూతనంగా ఎంపికైన మండల కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తమకు అప్పగించిన బాధ్యతలను నమ్మకంగా నిర్వహిస్తూ, మండల పరిధిలోని జర్నలిస్టులందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం అండగా నిలుస్తామని తెలిపారు. నవాబుపేట మండలంలో TWJF నూతన కమిటీ ఏర్పాటు కావడంతో స్థానిక జర్నలిస్టుల్లో ఉత్సాహం నెలకొంది. నూతన కమిటీ సభ్యులకు పలువురు జర్నలిస్టులు శుభాకాంక్షలు తెలియజేశారు.



గోమాత సంరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి: స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

గోమాతను కాపాడుకోవడం అంటే భారతీయ సంస్కృతిని, ప్రకృతిని, ధర్మాన్ని కాపాడుకోవడమే



ఇది కద నిజం, వికారాబాద్ జిల్లా, నవంబర్ 2: గోమాతను సంరక్షించుకోవడం అంటే భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతి, ధర్మాన్ని కాపాడుకోవడమేనని మైసూరులోని అవధూత దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ పేర్కొన్నారు. దేశంలో విపత్తులు సంభవించడానికి ప్రకృతి వైపరీత్యాలతో పాటు ప్రజల ప్రవర్తన, మానవ తప్పిదాలు కూడా కారణమవుతాయని ఆయన వ్యాఖ్యానించారు. ప్రకృతిని గౌరవిస్తూ, జీవరాశుల పట్ల కరుణ చూపుతూ ధర్మబద్ధమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం వట్టి మీనపల్లి గ్రామంలో హిందూ జనశక్తి ,శివశక్తి ఆధ్వర్యంలో నిర్మించిన అదితి గో క్షేత్రం సోమవారం ప్రారంభోత్సవం నిర్వహించారు. దేవతామూర్తుల స్థాపన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గోమాత సంరక్షణ ఆవశ్యకతను ప్రస్తావిస్తూ ప్రతి ఒక్కరూ గోరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గోమాత ప్రాముఖ్యతను వివరిస్తూ స్వామీజీ మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిలో గోవుకు అత్యంత విశిష్టమైన స్థానం ఉందని, గోవును కేవలం పశువుగా కాకుండా గోమాతగా ఆరాధించే సంప్రదాయం మనదని పేర్కొన్నారు. వ్యవసాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, పర్యావరణ పరిరక్షణలో గోవుల పాత్ర కీలకమని వివరించారు. గోసేవ అనేది కేవలం ధార్మిక కార్యక్రమం మాత్రమే కాదని, అది సామాజిక బాధ్యత కూడా అని స్పష్టం చేశారు. పాలు ఇవ్వని, వృద్ధాప్యంలో ఉన్న, అనారోగ్యంతో బాధపడుతున్న గోవులకు ఆశ్రయం కల్పించడంలో గోశాలలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. గోశాలలు కేవలం విరాళాలపై ఆధారపడకుండా స్వయం సమృద్ధి సాధించే విధంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. గోమయం, సేంద్రియ ఎరువులు, సహజ వ్యవసాయం వంటి అంశాల ద్వారా రైతులకు, గ్రామీణ యువతకు ఉపయోగపడే కేంద్రాలుగా గోక్షేత్రాలు ఎదగాలని అన్నారు. గోక్షేత్రాలు గోవుల సంరక్షణకే పరిమితం కాకుండా భారతీయ సంస్కృతి, వేద సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను భావితరాలకు అందించే కేంద్రాలుగా మారాలని పేర్కొన్నారు. పిల్లలు, యువతలో సేవాభావం, జీవకారుణ్యం, ప్రకృతి ప్రేమ వంటి విలువలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ధర్మం అంటే దేవాలయాలకు వెళ్లడం మాత్రమే కాదని, మన చుట్టూ ఉన్న జీవరాశుల పట్ల బాధ్యతగా వ్యవహరించడం కూడా ధర్మమేనని వివరించారు. శ్రీ అదితి గోక్షేత్ర నిర్వాహకులు చేపట్టిన ఈ ప్రయత్నం సమాజ సహకారంతో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైన రీతిలో ఆర్థిక సహాయం, పశుగ్రాసం, వైద్య సేవలు, స్వచ్ఛంద సేవ ద్వారా గోసేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు హిందూ జనశక్తి అధ్యక్షులు లలిత్ కుమార్ , శివశక్తి ఫౌండర్ కరుణాకర్ సుగుణ, హిందూ జనశక్తి రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్, శివశక్తి కళ్యాణ్ కుమార్ లు , గ్రామ సర్పంచ్ శేకర్ రెడ్డి , మాజీ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, దగ్గుల శ్రీహరి గౌడ్ అదే విదంగా ఆధ్యాత్మిక గురువులు, వేద పండితులు, గో సేవకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఢిల్లీ వేదికగా ఇండియా కూటమి పోరాటం

- తెలంగాణ భవన్ నుంచి ర్యాలీలో రాంలీలా మైదానంలో భారీ బహిరంగ సభలో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య.



ఇది కద నిజం,ఢిల్లీ: దేశ ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు పవిత్రతను కాపాడటమే లక్ష్యంగా ఇండియా కూటమి ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన ఓట్ చోర్ -- దేశ్ బచావో కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆలేరు నియోజకవర్గం నుంచి సుమారు 99 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఢిల్లీకి చేరుకున్నారు.

ఢిల్లీలోని తెలంగాణ భవన్ నుంచి ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీలో బీర్ల అయిలయ్య పాల్గొని, ప్రజాస్వామ్య పరిరక్షణకు సంబంధించిన నినాదాలతో ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. అనంతరం న్యూఢిల్లీలోని చారిత్రాత్మక రాంలీలా మైదానంలో నిర్వహించిన ఇండియా కూటమి భారీ బహిరంగ సభలో పాల్గొన్నారు. ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని ఇండియా కూటమి చేస్తున్న డిమాండ్‌కు మద్దతుగా నిర్వహించిన ఈ సభలో పాల్గొని తమ గళాన్ని వినిపించారు.

ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు పునాది అని, ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పే అంతిమమని, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగాలని స్పష్టం చేశారు.

ఓటర్ల జాబితాలో అక్రమాలు, ఓటు చోరీ ఆరోపణలు, ఎన్నికల వ్యవస్థలో అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం స్వతంత్రత, విశ్వసనీయతను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు.

దేశంలో ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తి, ప్రజల ఓటు హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి చేస్తున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగేలా ఎన్నికల ప్రక్రియలో పూర్తి పారదర్శకత ఉండాలని పేర్కొన్నారు.

ఆలేరు నియోజకవర్గం నుంచి సుమారు 99 మంది నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తనతో కలిసి ఢిల్లీకి చేరుకుని ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషకరమని బీర్ల అయిలయ్య తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ హక్కుల సాధన కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమంలో ఆలేరు నియోజకవర్గ శ్రేణులు భాగస్వాములవుతాయని పేర్కొన్నారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
మంగళవారం 03-11-2026

ప్రజావాణికి రెండు ఫిర్యాదులు పరిష్కారానికి చర్యలు



ఇది కద నిజం, నిజమాబాద్ జిల్లా : కామారెడ్డి జిల్లా పిట్లం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో సాయన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి రెండు ఫిర్యాదులు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని, అందిన ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత శాఖల ద్వారా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో సాయన్న పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలనతో పాటు చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ





ఇది కద నిజం, నిజాంబాద్ జిల్లా పిట్లం, నవంబర్ 02: కామారెడ్డి జిల్లా పిట్లం మండలం కంబాపూర్ గ్రామంలో రూ.45 లక్షల వ్యయంతో చేపడుతున్న కాకివాగు వంతెనకు ఇరువైపులా రక్షణ గోడ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ సుజాత శ్రావణ్ దేశాయ్ పరిశీలించారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు కావడంతో పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన చిన్నారుల పోషణ కార్యక్రమంలో భాగంగా ఐదేళ్లలోపు 50 మంది పిల్లల బరువు, ఎత్తును పరిశీలించి పోషణ స్థితిని గుర్తించారు. పోషకాహార లోపం ఉన్న పిల్లలకు బాలామృతం ప్లస్ అందించి, దాని వినియోగంపై తల్లులకు అవగాహన కల్పించారు.

టపాకాయలు అమ్ముటకు అనుమతి తప్పనిసరి



ఇది కదా నిజం, నిజామాబాద్ జిల్లా :దీపావళి పండుగ నేపథ్యంలో బాణాసంచా మరియు పేలుడు పదార్థాలు అమ్ముట కొరకు సంబంధిత అధికారుల దగ్గర తప్పనిసరిగా అనుమతి తీసుకొని వారి వద్ద నుంచి తగిన సర్టిఫికెట్ పొందిన తర్వాతనే అమ్మవలెను. ఎలాంటి అనుమతి లేకుండా అలాగే వివిధ రకాల కిరాణా షాపులలో, రోడ్డుపైన, నిషిద్ధమైన ప్రాంతాల్లో మరియు అనుమతి లేని ప్రదేశాలలో బాణాసంచా టపాకాయలు నమ్మినట్లయితే వారి పైన కేసులు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోబడుతాయి.

యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ వద్ద ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె

సంపూర్ణ మద్దతు తెలిపిన మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునిత



ఇది కద నిజం,యాదాద్రి భువనగిరి: యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నేషనల్ హెల్త్ మిషన్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె కార్యక్రమం తీవ్రరూపం దాల్చింది. తమ ఉద్యోగాలను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, న్యాయమైన హక్కులను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు చేపట్టిన ఈ నిరసన కార్యక్రమానికి మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఆలేరు నియోజకవర్గ ఇంచార్జ్ గొంగిడి సునితా మహేందర్ రెడ్డి హాజరై తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా గొంగిడి సునితా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఉద్యోగుల హక్కుల సాధన కోసం అవసరమైతే వారితో కలిసి తాను కూడా నేరుగా సమ్మె ప్రదేశంలో కూర్చుని పోరాడేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ప్రజా ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిశీలించి న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఉద్యోగుల పోరాటానికి బిఆర్ఎస్ పార్టీ నుంచి పూర్తి సహకారం ఉంటుందని, వారి హక్కులు సాధించే వరకు విశ్రమించేది లేదని ఈ సందర్భంగా ఆమె భరోసా ఇచ్చారు.

యాదాద్రి కొండపై శివునికి వైభవంగా విశేష పూజలు





స్ఫటిక లింగేశ్వరుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం

ఇది కద నిజం,యాదగిరిగుట్ట: యాదాద్రి పుణ్యక్షేత్రం కొండపైన వేంచేసి ఉన్న పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ప్రధానాలయంలో సోమవారం పరమశివుడికి అర్చకులు వైభవంగా విశేష పూజలు నిర్వహించారు. సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో తెల్లవారుజాము నుంచే ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా గర్భాలయంలోని స్ఫటిక లింగేశ్వరుడికి ప్రభాతవేళ అర్చకులు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని సుమారు గంటన్నరపాటు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపారు. స్వామివారికి పంచామృతాలతో వేదమంత్రోచ్చారణల నడుమ అభిషేకం నిర్వహించారు. అనంతరం అభిషేక ప్రియుడైన పరమశివుడిని విభూతితో, నేత్రపర్వంగా విశేష పుష్పాలతో అలంకరించారు. అలాగే ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాల్లో కొలువుదీరిన సుబ్రహ్మణ్యస్వామి, మహాగణపతి, శ్రీ ఆంజనేయస్వామి మరియు నాగదేవత విగ్రహాలకు అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. శివాలయం ప్రధాన పురోహితుల సమక్షంలో జరిగిన ఈ విశేష పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామివారి దివ్య మంగళ రూపాన్ని దర్శించుకుని తరించారు.

పాత్రికేయుల సేవలు సమాజానికి ఎంతో కీలకం: నల్లాల వినయ్ కుమార్



ఇది కద నిజం, నిజాంబాద్ జిల్లా :పాత్రికేయులు సమాజంలో జరిగే సంఘటనలు, వాస్తవాలను ప్రజలకు చేరవేస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తున్నారని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నల్లాల వినయ్ కుమార్ పేర్కొన్నారు. కత్తి కన్నా కలం గొప్పదనే మాటకు పాత్రికేయులే నిదర్శనమని అన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో, ప్రభుత్వాన్ని జవాబుదారీగా ఉంచడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని కొనియాడారు. పాత్రికేయులపై దాడులు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని, దాడులకు పాల్పడే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని నల్లాల వినయ్ కుమార్ కోరారు.

అక్రమంగా తరలిస్తున్న అంగన్‌వాడీ బియ్యాన్ని పట్టుకున్న గ్రామస్తులు



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: పిట్లం మండలంలోని అన్నారం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి సరఫరా చేసిన బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. చిన్నారులకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని అంగన్‌వాడీ కేంద్ర నిర్వాహకురాలు తన భర్తతో కలిసి తరలిస్తుండగా గమనించిన గ్రామస్తులు వారిని అడ్డుకుని, బియ్యం, పాల ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేంద్రానికి తాళం వేశారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

జఫర్‌గఢ్‌లో ఘనంగా కలెక్టర్ కప్ క్రీడా పోటీలకు ఏర్పాట్లు

● అండర్-14, అండర్-17 విభాగాల్లో విద్యార్థులకు పోటీలు

జఫర్‌గఢ్ నవంబర్ 02 (ఇది కద నిజం)



జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నవంబర్ 3న మంగళవారం మండల స్థాయి కలెక్టర్ కప్ క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు మండల విద్యాధికారి మంగు జయప్రకాశ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు.సోమవారం మండల వనరుల కేంద్రంలో వివిధ క్రీడా పోటీల నిర్వహణ కమిటీలతో సన్నాహక సమావేశం నిర్వహించారు.మండలంలోని పలు పాఠశాలల్లో ఇప్పటికే నిర్వహించిన ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మండల స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎంఈఓ తెలిపారు.చెస్, క్యారమ్స్, బ్యాడ్మింటన్, యోగాసనాల విభాగాల్లో అండర్-14, అండర్-17 కేటగిరీల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలన్నీ వ్యక్తిగత విభాగాల్లో జరగనున్నాయి. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు.క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని కమిటీల సభ్యులు సమన్వయంతో పనిచేయాలని ఎంఈఓ మంగు జయప్రకాశ్ సూచించారు.ఈ సమావేశంలో పీఈటీలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు



ఇది కద నిజం, యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌరయిపల్లి గ్రామంలో మాదకద్రవ్యాల నిరోధం మరియు వాటి వల్ల కలిగే నష్టాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యాదగిరిగుట్ట ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బందితో పాటు స్థానిక గ్రామస్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు మానవ శరీరాన్ని, మానసిక స్థైర్యాన్ని, కుటుంబాన్ని మరియు భవిష్యత్తును పూర్తిగా నాశనం చేసే ప్రమాదకరమైన పదార్థాలని హెచ్చరించారు. తాత్కాలిక ఆనందం కోసమో, స్నేహితుల ఒత్తిడి వల్లనో లేదా కుతూహలంతోనో వీటిని ఒక్కసారి ఉపయోగిస్తే, దానికి బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటారని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలకు అలవాటు పడటం వల్ల చదువు దెబ్బతినడమే కాకుండా, నేరాల బాట పట్టే ప్రమాదం ఉందని, తద్వారా కుటుంబాలకు తీవ్ర మానసిక, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల విక్రయాలు లేదా వినియోగం జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఈ సందర్భంగా కోరారు. సమాజంలో మాదకద్రవ్యాల రహిత వాతావరణాన్ని సృష్టించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని పిలుపునిచ్చారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ పాదయాత్రలో జనగామ జిల్లా బీజేపీ నాయకులు

అమిత్ షా పిలుపు మేరకు హైదరాబాద్‌లో మహా పాదయాత్ర



ఇది కద నిజం న్యూస్ హైదరాబాద్ నవంబర్ 02

ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యంగా బీజేపీ చేపట్టిన మహా పాదయాత్రలో జనగామ జిల్లా నాయకులు పాల్గొన్నారు. దేశ హోంశాఖ మంత్రి అమిత్ షా పిలుపు మేరకు హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ పాదయాత్ర బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి మొజాంజాహీ మార్కెట్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా ఎండోమెంట్ సెల్ జాయింట్ కన్వీనర్ బుర్ర తిరుపతి గౌడ్, జఫర్‌గఢ్ మండల మాజీ అధ్యక్షుడు తౌటి సురేష్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి బీజేపీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు పార్టీ శ్రేణులు ఐక్యంగా ముందుకు సాగాలని అన్నారు.

హనుమకొండలో ఘనంగా హోప్ కమ్యూనిటీ కేర్ లీడర్స్ సమావేశం

500 మందికి పైగా పాస్టర్లు, సంఘ పెద్దలు హాజరు

హనుమకొండ (ఇది కద నిజం) నవంబర్ 02:



మెలిటా ఛారిటబుల్ ట్రస్ట్, హోప్ ఫర్ ఇండియా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో హోప్ కమ్యూనిటీ కేర్ లీడర్స్ సమావేశాన్ని సోమవారం హనుమకొండలో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ ప్రాంతాల నుంచి 500 మందికి పైగా చర్చి పాస్టర్లు, సంఘ పెద్దలు, నాయకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా సమాజ సంక్షేమం, ఆధ్యాత్మిక సేవలు, ప్రజలకు అందించాల్సిన సేవా కార్యక్రమాలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. సమాజ అభివృద్ధిలో ఆధ్యాత్మిక నాయకుల పాత్ర, సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాల్సిన ఆవశ్యకతను వివరించారు.భారీ సంఖ్యలో పాస్టర్లు, సంఘ నాయకులు పాల్గొనడంతో సమావేశం విజయవంతంగా ముగిసింది.